విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 08, అక్టోబరు 2025

న్యాయమూర్తిని అవమానించడం దారుణం

విశాలాంధ్ర - నంద్యాల : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ గవాయిపై న్యాయవాదిపై కోర్టులోనే బూటు వేసి అవమానించడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ఓ ప్రకటనలో ఖండించారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియంతృత్వ పాలన చేస్తూ మనువాద భావజాలంతో సనాతన ధర్మాన్ని అమలు చేయాలని దేశంలోని అన్ని స్వతంత్ర వ్యవస్థలను తమ చెప్పు చేతల్లో ఉంచుకొని భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా తూట్లు పొడుస్తూ సనాతన మనుధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయాలని తీవ్ర కుట్రలు చేస్తున్న నేపథ్యంలోనే తమ భావజాలాన్ని వ్యతిరేకించే వారిని బహిరంగంగా అవమానించి భయపెట్టి న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చేస్తున్న కుట్రలో భాగంగానే సుప్రీం కోర్టులో ఈ దారుణం జరిగింది. రాజ్యాంగాన్ని కాపాడతానని ప్రమాణం చేసి పాలన చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశంలో అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో జరిగిన ఈ దారుణ సంఘటనపై దోషిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆత్మకూరులో 28 వార్డులా..

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్: పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ఆసియా మారూఫ్, కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆత్మకూరు పట్టణాన్ని మొత్తం 28 వార్డులగా విభజించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణం గ్రేట్ టు విభాగంలో ఉన్నందున మొదట్లో ఉన్న 24 వార్డుల స్థానంలో ఇప్పుడు మొత్తం 28 వార్డులుగా విభజించారు. ఈ 28 వార్డులకు సంబంధించి హద్దుల విషయంలో కౌన్సిల్ సభ్యులు అభ్యంతరాలు తెలపడంతో మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారూఫ్ ఈ తీర్మానాన్ని వాయిదా వేశారు.

గ్రామాల్లోకి వరద నీరు..

విశాలాంధ్ర - చాగలమర్రి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ముత్యాలపాడు, తోడేండ్లపల్లె గ్రామాల్లోకి వరద నీరు బారీగా వచ్చి చేరింది. ఎగువ ప్రాంతమైన ఆహోబిళం మఠం చెరువు నిండి అలుగు మీది నుంచి పొంగి ప్రవహిస్తుండటంతో ఆ వరద నీరు దిగువ ప్రాంతాలకు వచ్చి చేరింది. దీంతో మండలంలోని ముత్యాలపాడు, తోడేండ్ల పల్లె గ్రామాల్లో మోకాళ్ళ లోతు మేర సోమవారం అర్ధరాత్రి నీరు ప్రవహించింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు విజయ్‌కుమార్ గ్రామాలలో పర్యటించి వరద నీటిని, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. సర్పంచ్ గోవిందయ్య, టీడీపీ నాయకులు సింగిల్ విండో అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, ఇండ్ల రమణారెడ్డిలు వరదనీటి పరిస్థితిని, పంటల నష్టాన్ని తహసీల్దారుకు వివరించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

వన్యప్రాణుల చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - రుద్రవరం: అటవీ వన్యప్రాణుల సంరక్షణ, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం వన్యప్రాణుల వారోత్సవాలను ఎల్లా వత్తుల, మహాదేవపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా రెండు గ్రామాలలో ర్యాలీ నిర్వహించి అటవీ సంరక్షణ వన్యప్రాణి సంరక్షణపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మానవుని మనుగడకు అడవులు, వన్యప్రాణులు ఎంతో ప్రాముఖ్య మైనవని ఆయన తెలిపారు. బీట్ అధికారులు రామారావు, నాగప్ప, సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శాంతిరాం ఇన్‌స్టిట్యూ షన్స్ క్రికెట్ లీగ్ సీజన్

విశాలాంధ్ర - పాణ్యం: స్థానిక శాంతిరాం మెడికల్ కళాశాల మైదానంలో ఎస్ఆర్ఎంసీ గ్లాడియేటర్స్, ఎస్ఎస్ఆర్ రాయల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శాంతిరాం ఫార్మసీ కళాశాల జట్టు రన్నర్స్ గా నిలిచిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్య అతిథులుగా శాంతిరాం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వసంత్ ఆర్ చావన్, ఆర్జీఎం, శాంతిరాం విద్యాసంస్థల డీన్ అశోక్ కుమార్, మెడికల్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘురాం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాండురంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జిఎం, శాంతిరాం గ్రూపు ఇన్‌స్టిట్యూషన్ ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేష్, చంద్ర రెడ్డి, ముని శంకర్, వెంకటేష్ నాయక్, మల్లికార్జున, మనోహర్ పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ జీఓలు రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్లు 2, 13, 51లను వెంటనే రద్దు చేయాలని ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ విజయ్ కుమార్ అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. మాట్లాడుతూ ఆదివాసీలకు తెలియ కుండా అక్రమ సర్వేలు, సరిహద్దు రాళ్ల తొలగించడం ప్రభుత్వ అధికారులతో కలిసి కంపెనీలు చేస్తున్న తీరును ఖండించాలన్నారు. ఇది గిరిజన హక్కుల దుర్వినియోగానికి నిదర్శనం, సంబంధిత ఔత్సాహిక కంపెనీలకు భూములు కేటాయించడాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ వాలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని స్త్రీ శక్తి భవనం నందు ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ వాలంటీర్లకు మంగళవారం ఏపీవో ప్రకాష్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్చార్జి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, మండల ఇన్చార్జి పర్యవేక్షకులు ఆది నరసింహులు హాజరయ్యారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ నిరక్షరాశులయిన శ్రామికులు అందర్నీ అక్షరాషులుగా చేసే బాధ్యత ఉందన్నారు. ఇంచార్జీ మండల పర్యవేక్షకులు ఆది నరసింహ మాట్లాడుతూ వాలంటీర్లుఅందరూ ప్రతి రోజు మీకు కేటాయించిన పదిమంది శ్రామికులను సాయంత్రం ఐదు నుండి 7 గంటల వరకు గాలి వెలుతురు సరిగా వచ్చే సెంటర్లను ఏర్పాటు చేసుకుని వారికి సాధన పుస్తకాలలో ఉన్న పాఠ్యాంశాలను నేర్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ఎస్ సంస్థను నిషేదించాలి : సీపీఐ

విశాలాంధ్ర - ప్యాపిలి: భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై సనాతన వాది లాయరు దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అని, ఆర్ఎస్ఎస్ సంస్థను నిషేదించాలని జిల్లా సీపీఐ సమితి కార్యదర్శి ఎన్.రంగనాయుడు తీవ్రంగా ఖండించరు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కలచట్ల రాధాకృష్ణ, మండల సీపీఐ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేష్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో సనాతన వాది ఆర్ఎస్ఎస్ మత సంస్థ కు చెందిన రాకేష్ కిషోర్ అనూహ్యమైన పద్ధతిలో ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై చెప్పుతో దాడితో పాల్పడం హేమమైన చర్య అని, సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని కాపాడాలని పెద్ద పెద్దగా అరుస్తూ రంకెలు వేస్తు ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టిస్తున్నా ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సమాధానం చెప్పాలని వారు పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. ప్రపంచంలోనే భారతదేశ లౌకిక వ్యవస్థగా పేరుగాంచిన దేశంలో గతంలో ఎవరి అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా వెలిబుచ్చే పరిస్థితి ఉండేది. కేంద్రంలో బీజేపీ అధికారంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన నాటి నుండి సనాతన వాదులలో రోజురోజుకీ అసహనం పెరుగుతుంది. చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడులు చేసే స్థాయికి సనాతన పిచ్చి చేరిందంటే ప్రజానీకం అర్థం చేసుకోవాలని, ఈ దాడి భారత రాజ్యాంగంపై దాడి అని, దీన్ని ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

ప్రధాని పర్యటన సందర్భంగా భద్రత చర్యలపై సమీక్ష : ఐజీపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా ఐజిపి ఆర్.కె రవికృష్ణ ఆధ్వర్యంలో శ్రీశైలంలోని పరిపాలన విభాగం నందు గల మీటింగ్ హాల్ నందు భద్రత ఏర్పాట్ల గురించి సంబంధిత పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి రాక సందర్భంగా హెలిపాడ్స్, రూట్ బందోబస్తు, పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవలసిన చర్యలు, ముఖ్యమైన ప్రాంతాలలో ఏర్పాటు చేయవలసిన పికెట్లు, చెక్ పోస్ట్‌లు, ప్రధాని పర్యటించే ప్రదేశాలలో భద్రత కట్టుదిట్టంగా నిర్వహించేలా తీసుకోవలసిన చర్యలపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, గ్రేహౌండ్స్ డిఐజి బాపూజీ, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ప్రకాశం ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డిజిపి ఆఫీస్ ఎస్పీ అధిరాజ్ సింగ్ సింగ్ రాణా, ఈజీ అశోక్ కుమార్, సిఐడి ఎస్పి శ్రీధర్ రావు, అదనపు ఎస్పీ యుగంధర బాబు, ఆత్మకూరు డీఎస్పీ రాంజీనాయక్, శ్రీశైలం సీఐ ప్రసాదరావు, జిల్లా సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అగౌరవపరిచిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ న్యాయ వ్యవస్థను బెదిరింపు ధోరణికి పాల్పడుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై సనాతన ధర్మం పేరుతో బూటు విసిరిన మతోన్మాది న్యాయవాది రాకేష్ కిషోర్‌పై దేశ ద్రోహం కేసు నమోదు చేసి దేశ బహిష్కరణ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం సంజీవనగర్ గేటు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమిని శ్రీనివాసులు అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు వి.మురళీధర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, ఏఐవైఎఫ్ జిల్లా

ప్రధాన కార్యదర్శి జి.నాగరాముడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.హరినాథ్, సిపిఐ నాయకులు ధనుంజయుడు, జిలానిభాష, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబాఫక్రుద్దీన్, మురళీధర్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ జరగని అనూహ్య సంఘటన సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి సనాతన ధర్మం పేరుతో న్యాయవాది రాకేష్ కిషోర్ బూటు విసరడం రాజ్యాంగ సంస్థలను అవమానపరచడం, న్యాయవ్యవస్థను బెదిరించడమే లక్ష్యంగా ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నమనమన్నారు. సనాతన ధర్మం పేరుతో దాడికి పాల్పడ్డ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడులు చేసే స్థాయికి పిచ్చి ముదిరిందని, దాడికి పాల్పడ్డ మతోన్మాది రాకేష్ కిషోర్ ను దేశద్రోహం కేసు నమోదు చేసి దేశ బహిష్కరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నాగార్జున, మున్నా, నబిసా, రవి, సుభాను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం : సీపీఐ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: భారతదేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి అయిన సనాతన వాది లాయరు దాడికి పాల్పడడం సిగ్గు చెటైనా విషయమని, తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో సనాతన వాది ఆర్ఎస్ఎస్ మత సంస్థకు చెందిన రాకేష్ కిషోర అనే ఉన్మాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై దాడికి పాల్పడం హేమమైన చర్య అని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు శీను, నరసింహ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

1800 క్వింటాల సబ్సిడీ సెనగలు కేటాయింపు

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : మండలానికి 18 వందల క్వింటాల సబ్సిడీ సెనగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. మండలానికి 3500 క్వింటాళ్ల జేజి 11 శనగ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 18 వందల క్వింటాళ్ల విత్తన శనిగలను కేటాయించిందన్నారు. క్వింటా సెనగ విత్తనాలు ధర రూ.7800 కాగా 25శాతం సబ్సిడీతో రైతులకు రూ.5850తో అందజేస్తామని తెలిపారు. అర్హేకరాకు 20 కేజీల చొప్పున ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాలకు 200 కేజీలు (పది ప్యాకెట్లు) సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. సెనగ సబ్సిడీ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో ఆధార్, మొబైల్, వన్ బి, తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌కు ఉదయం సిబ్బంది వెళ్తారని, ఈ నెల 8 నుండి ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఆర్ఎస్కే కేంద్రాలలో సంప్రదించాలన్నారు. మరో 1200 క్వింటాళ్ల సెనగ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మంత్రి సహకారం మరువలేనిది

విశాలాంధ్ర - బనగానపల్లె: స్వచ్ఛ గ్రామ పంచాయతీగా బనగానపల్లె పట్టణం ఎంపిక కావడం పారిశుధ్య కార్మికులు, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, బిసి ఇందిరా రెడ్డి సహకారం మరువలేనిదని గ్రామపంచాయతీ ఈవో బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు పారిశుద్ధ కార్మికులు పట్టణ ప్రజలు గ్రామపంచాయతీ ఈవోను సన్మానించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - ప్యాపిలి : మండల పరిధిలోని జలదుర్గం గ్రామ సమీపంలో శిగరమాను సర్కిల్ నందు లారిలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని కర్ణాటకు తరలి స్తుంటే డిస్ట్రిక్ సివిల్ సప్లై అధికారి రవిబాబు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాసిల్దార్ శేఖర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి దాడి చేసి సీజ్ చేశారు. వివరాల మేరకు.. ఏపీ 39 టీవీ 4559 అనే లారీలో అక్రమ రేషన్ బియ్యం ను బనగానపల్లె నుండి కర్ణాటకకు తరలిస్తుంటే దాదాపు లారీలో 35 టన్నుల రేషన్ బియ్యం సీజ్ లారీ డ్రైవర్లు ప్రవీణ్, చిన్న మద్దిలేటి, వీరిని అదుపులోకి తీసుకొని జల్దుర్గం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వైసీపీ సీనియర్ నాయకులు మృతి

విశాలాంధ్ర జూపాడు బంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన వైసీపీ మండల సీనియర్ నాయకులు వంగాల శంకర్ రెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. శంకర్ రెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, పెద్దలు డాక్టర్ బైరెడ్డి మల్లి కార్జున రెడ్డి తాటిపాడు గ్రామానికి చేరుకొని వంగాల శంకర్ రెడ్డి పార్థీవానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి లింగాపురం గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి నాగార్జున రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, తరుణ్ రెడ్డి, జెడ్పిటిసి పోచ జగదీశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, నరేష్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయం నుండి సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా విజయవాడ ధర్నా చౌక్ వద్ద ప్యాప్టో ఆధ్వర్యంలో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాకు తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్‌సి మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి, చర్చించిన పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబం ధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచి పోయిందని వాపోయారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మస్తాన్, మండల ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్,మండల కార్యదర్శి గౌస్అహమ్మద్, గురుచంద్రుడు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌ల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లను కలుసుకొని వారి సమస్యలను సిపిఐ కొలిమిగుండ్ల కార్యదర్శి సూర్యనారాయణ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వడ్డే మహేష్ తదితరులు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే యూనియన్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పని లేకున్నా ఆశ వర్కర్లను గ్రామ సచివాలయాల అధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కొందరు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లపై కఠినంగా వ్యవహరిస్తున్నారని వారి చర్యలపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. బెలుం గ్రామ ఆశా వర్కర్ వెంకటలక్ష్మి ఇటీవల మరణించారని, ఆమె స్థానంలో ఆ పోస్టును ఆమె కుమార్తెకు ఇవ్వవలసిందిగా కోరుతూ డిఎంహెచ్వో దృష్టికి యూనియన్ నాయకులు తీసుకువెళ్లారని తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు చంటి, నాగరాజు కంబయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమాలకు చెక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమాలకు చెక్ పెట్టవచ్చని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. నంద్యాల పట్టణం 14వ వార్డులో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఫిరోజ్ మాట్లాడుతూ క్యుఆర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులు పౌర సరఫరా వ్యవస్థలో పూర్తిస్థాయి పాదదర్శకతను తీసుకువస్తాయన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిత్యావసర సరుకులు సరళంగా, నేరుగా ఎవరికీ ఇబ్బందులు లేకుండా లభిస్తాయన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సొంత వనరుల ఆదాయంపై శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: సొంత వనరులతో గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న అంశంపై అవగాహన సదస్సు జరిగింది. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో ఆర్జిఎస్ఏ కార్యాచరణ ప్రణాళికపై మండలం లోని సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారం భమైంది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సొంత వనరుల ద్వారా గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. గ్రామాభివృద్ధిపై అవగాహన అవసరమన్నారు.

ఆర్‌ఓఆర్ రెవెన్యూ రికార్డులు మాయం

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల పరిధిలోని కామినేని పల్లె గ్రామ పరిధిలో ఆర్ఓఆర్ రెవెన్యూ రికార్డులు మాయం అయినట్లు తహసీల్దార్ విజయశ్రీకి మంగళవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 50, 51 సర్వే నెంబర్లలోని పొలం యజమానుల వివరాలు భూమి వివరాలకు సంబంధించిన ఆర్ఓఆర్ రికార్డులు మాయం చేశారని ఫిర్యాదు అందడంతో తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ కుమార్ మండల సర్వేయర్ మల్లయ్యకు గ్రామ విఆర్ఓ తదితర అధికారులను విచారణకు ఆదేశించారు. విచారణ నిమిత్తం కామినేనిపల్లె గ్రామంలోని సచివాలయ భవనంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించగా అధికారులు నివ్వేరపోయారు. రెండు సర్వే నెంబర్లు కనిపించలేదని ఫిర్యాదు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా అసలు విషయం బట్టబయలు అయింది.మాత్రం 1 నుండి 51 వరకు సర్వే నెంబర్ల వివరాలు ఉన్న ఆర్ఓఆర్‌లో పేజీలు మాయం అయ్యాయని అధికారులు స్పష్టం చేశారు. రెండు సర్వే నెంబర్లు మాత్రమే కనిపించలేదని అనుకుంటే తీరా 1 నుంచి 51 వరకు సర్వే నెంబర్లు గల పేజీలు కనిపించడం లేదని మాయం అయ్యాయని గ్రామస్తులు విస్మయం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆర్ఓఆర్ రికార్డులు 1 నుండి 51 వరకు రీసర్వే నిమిత్తం విలేజ్ సర్వేయర్ షరీఫ్‌కు అప్పగించినట్లు తాసిల్దార్ కిషోర్ కుమార్ మరియు మండల సర్వేయర్ మల్లయ్య పేర్కొన్నారు.విలేజ్ సర్వేయర్ షరీఫ్‌కు ఆర్ఓఆర్ రికార్డులు చూడకుండానే రీ సర్వే పూర్తి చేశారా, లేక రికార్డులు ఎక్కడ ఉన్నాయన్నది ఏం చేశారు, ఒకవేళ రికార్డులు మొదటి నుంచి లేకపోతే తన పైస్థాయి అధికారులకు షరీఫ్ ఎందుకు సమాచారం ఇవ్వలేకపోయారని కామినేని పల్లె గ్రామస్తులు ప్రశ్నించారు. కామినేని పల్లె గ్రామ పరిధిలోగల 1 నుంచి 51 సర్వే నెంబర్లు రీ సర్వేలో భాగంగా బాధ్యత తీసుకున్న సర్వేయర్ షరీఫ్ ఆ పేజీలు ఎక్కడ ఉన్నాయో ఎలా మాయమయ్యాయో సమాధానం చెప్పాల్సి ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆర్ఓఆర్ రికార్డులు చూడకుండానే సర్వే చేశారా అని రికార్డులు మాయం అయిన సంఘటనపై షరీఫ్‌ను సంజయసి కోరి అధికారులు సమాధానం చెప్పాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. 200 ఏళ్లకు పైగా భారతదేశాన్ని ఏలిన బ్రిటిష్ పాలకులు రెవెన్యూ రికార్డులను సర్వే చేసి భద్రపరిచి మనకు అప్పగించారే వారు ఏనాడు భూములకు సంబంధించిన రికార్డులు మాయం చేయలేదని, నేడు ఎలా మాయం అయ్యాయో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి మంత్రి ఫరూక్, వాల్మీకి సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవిగా మానవజాతికి చిరస్మరణీయమైన రామాయణాన్ని రచించారని గుర్తు చేశారు. ఆయన జీవితం, ధర్మబోధనలలో నిగూఢమైన మానవతా విలువలు నేటి సమాజానికి మార్గదర్శకమన్నారు. అంతకు ముందు వాల్మీకి సంఘాల నాయకులు గోవింద నాయుడు, బోయ రామకృష్ణ, కాశన్న, వెంకటేశ్వర్లు, గుర్రప్ప, లాలుస్వామి తదితరులు వాల్మీకి మహర్షి సమాజానికి అందించిన సేవలపై ప్రసంగించి, ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కోరారు.

ప్రధాని మోడీ శ్రీశైల పర్యటనను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రముఖ శైవక్షేత్రం, అష్టాదశశక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన భూకైలాసంగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను తన ఆహ్వానం మేరకు దర్శనం చేసుకునేందుకు ఈ నెల 16న గురువారం ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం వస్తున్నారని, తన ఆహ్వానం మన్నించి శ్రీశైలం వస్తున్న ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దామని నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. మంగళవారం శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, దేవస్థానం పాలకమండలి సభ్యులు మేడా మురళీధర్, రేఖాగౌడ్‌లతో కలిసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైల శ్రీ భ్రమరాంబ, మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అర్చకులు, వేద పండితులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, చైర్మన్ రమేష్ నాయుడు, సభ్యులు మేడా మురళి, రేఖలకు స్వామి, అమ్మ వార్ల దర్శనం అనంతరం శేష వస్త్రాలతో సన్మానం చేసి, తీర్థ ప్రసాదం, స్వామి, అమ్మ వార్ల చిత్రపటాలను అందించి ఆశీర్వదించారు. శ్రీశైలంలోనే ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పి సునీల్ షేరాన్, శ్రీశైలదేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, తదితర జిల్లా ఉన్నతాధికారులతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేద్దామని కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అతివృష్టి.. అనావృష్టితో అన్నదాత అధోగతి



విశాలాంధ్ర- చిప్పగిరి: అరుగాలం కష్టించి రాత్రి అనక పగలు అనక రైతుల పొలాలలో పంటలు సాగు చేస్తే సాగు చేసిన పంటలు చేతికి అందక అన్నదాత అధోగతి పాలైన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందు తున్నారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామంతోపాటు మండల పరిధిలోని నంచర్ల, దౌల్తాపురం, నగర డోన, నేమకల్లు, కుందనగుర్తి, రామ దుర్గం గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో విరివిగా కంది పంటను సాగు చేస్తూ వస్తున్నారు. అన్నదాతలు పొలాలలో పంటలు సాగు చేసినప్పటి నుంచి రాత్రనకా, పగలనకా పొలాలలోనే ఉంటూ పంట చేతికి అందేవరకు కంటికి చెప్పాలా కాపాడుకుం టున్న అన్నదాతకు అతివృష్టి, అనావృష్టితో సాగు చేసిన పంటలు తుడుచుకుపోవడంతో రైతు కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్ప డిం దని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నా రు. చేతుల్లో చిల్లి గవ్వా లేకున్న ప్పటికీ అప్పులు చేసి పంటలు సాగు చేస్తే ఎడతెరిపి లేని భారీ వర్షాలతో సాగు చేసిన పంటలు చేతికి అందకుండా పోవడంతో అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోయామని రైతులు బాధను వ్యక్తం చేస్తున్నారు. నంచర్ల గ్రామంలో ఎర్ర నేల పొలాల్లో వేల ఎకరాలలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కంది పంట సాగు చేయడం జరిగిందని, భారీ వర్షాలకు కంది పంట పూర్తిగా దెబ్బ తినడంతో మరో పంట మరో పంట ఏమి వేయలేని, దీనస్థితిలో అన్నదాత ఉండి పోవాల్సిన దుస్థితి ఏర్పడింద న్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి, రైతులకు పంట నష్ట పరిహారము అందే విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నదాతలు ఆవేదనతో వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులైన పేదలకు రెండు సెంట్ల నివాస స్థలం ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: నగరంలో సొంత ఇండ్లులేక అద్దెగృహాల్లో నివాసం ఉంటున్న ప్రతి పేదవారికి రెండు సెంట్ల నివాస స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇంటి స్థలాల సాధన సమితి ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ రామచంద్ర నగర్ సచివాలయం ముందర ధర్నా నిర్వ హించారు. అంతకు ముందు సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలం లేని ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని అది నివాసయోగ్యమైన ప్రాంతాలలో ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వాలు ఇందిరమ్మ గృహాలు కట్టించి వదిలేయడం జరిగినది వాటి పట్టించుకున్న దాఖలాలు లేవ న్నారు. టిడ్కో గృహాల పేరుతో ఇల్లు నిర్మించి ఇంత వరకు వారిని పంపిణీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో పసుపుల రుద్రవరం గ్రామాలు దాటిన తర్వాత కర్నూలు నగర పేదలకు ఒక సెంటు స్థలం మాత్రమే పట్టా ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో ఇంటి స్థలము లేని పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని సీఎం నారా చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడమే కాకుండా క్యాబినెట్ ఆమోదం పొంది జీవోలు జారీ చేయడం జరిగిందన్నారు. కొంత మంది సచి వాలయం అధికారులు పేదల నుండి అర్జీలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే పేదల నుండి అర్జీలు స్వీకరించి ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, రబియా, నూర్జహాన్, అల్లాబీ, మునెమ్మ, బి.రాముడు, శివమ్మ, మరియమ్మ, ఆదాము తదితరులు పాల్గొన్నారు.

నేడే మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని మండల అభివృద్ధి అధికారి రాణెమ్మ అన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ, జెడ్పిటిసి సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ, మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరై ఈ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, పశుగణాభివృద్ధి ,రక్షిత మంచినీటి సరఫరా మరియు పారిశుధ్యం, పంచాయతీరాజ్ శాఖ మరియు వెలుగు పథకం ఉపాధి హామీ పథకం, విద్య వైద్యం, గృహ నిర్మాణం, విద్యుత్తు , శిశు సంక్షేమం, గ్రామ పంచాయతీల పనితీరు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు వివరించడం జరుగుతుందన్నారు.

స్వంత ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్రమం: గ్రామ పంచాయతీలో సొంత ఆదాయం పెంచుకొనే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెం ట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఆయా గ్రామపంచాయతీలో సొంతంగా ఆదాయ వనరులను ఎలా పెంచుకోవాలన్న విషయాలను వివరించారు.

బిందు సేద్యంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మైక్రో బిందు నీటిపారుదల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని మంగళవారం కల్లుకుంట గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వీహెచ్‌ఏ పవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి మాట్లాడుతూ బిందు సేద్యానికి ప్రభుత్వం ఏ వర్గానికి ఎంత రాయితీ ఇస్తుందో తెలియజేయాలన్నారు. బిందు సేద్యం పట్ల రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ దూద్ పీరా, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర - ఆస్పరి: మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి వేడుకలను తహసీల్దార్, ఎంపీడీవో, సొసైటీ కార్యాలయాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందు వాల్మీకి మహర్షి చెప్పడానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర ఉమాదేవి, తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, సొసైటీ సీఈఓ నరసింహులు మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన అంశాలను రామా యణం అడుగడుగునా బోధిస్తుందన్నారు. వాల్మీకి సంఘం నాయకులు వైసీపీ మాజీ కన్వీనర్‌లు సుంకర రామాంజనేయులు, పెద్దయ్య, మనో హర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, టీడీపీ మాజీ కన్వీనర్‌లు ఎస్.తిమ్మన్న, శ్రీనివాసులు గౌడ్‌లు పాల్గొన్నారు.

సీజేఐ దాడి సమంజసం కాదు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం అధ్యక్షులు వై.జయరాజు, ఎ.మాదన్న ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ జిల్లా కోర్టు నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిని దాడి చేయడం బాధాకరం విషయమన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిందిపోయి ఇలాంటి దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మతోన్మాద ప్రోత్సహిస్తూ న్యాయవాది చేయడం సిగ్గుచేటు అన్నారు. ఐఏఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్, ఐలు నాయకులు బి.చంద్రుడు, బిఎల్ఎఫ్ నాయకులు చిన్న మౌలాలి, ఏరా బజ్జి రాజేష్, మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్ : నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. వైసీపీ కార్యాలయం నుండి వాల్మీకి సోదరులతో కలిసి ర్యాలీగా బయలుదేరి, ఎమ్మిగనూరు పట్టణంలోని ట్యాంక్ బండ్ వద్ద వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుట్టా రేణుక ఆదేశాల మేరకు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బోయ బజారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు బోయ రాజు ఆధ్వర్యంలో వాల్మీకి సోదరులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇఆర్ మురారి రెడ్డి, మండల అధ్యక్షులు బీఆర్ బసిరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తాం : మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో మరిన్ని నూతన బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వెను కబడిన తరగతుల విద్యకు కూటమి అధిక ప్రాధాన్య మిస్తోంది, దీనిలో భాగంగా బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పావలా వడ్డీకే విద్యా రుణాలు అందజేయ నున్నట్లు వెల్లడించారు. వాల్మీకులకు ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత ప్రకటించారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంత్యోత్సవాన్ని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఘనంగా నిర్వ హించారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజల్వన చేసి నివాళులర్పించారు. మంత్రి సవిత మాట్లాడుతూ, వాల్మీకి రామాయణం రచించి సమాజానికి సన్మార్గాన్ని చూపుతోందన్నారు. వాల్మీకి మహర్షి వాల్మీకులకు మాత్రమే సొంతం కాదని ప్రపంచానికే సొంతమన్నారు. వాల్మీకి రామాయణం ప్రపంచ ప్రఖ్యాతగాంచిందన్నారు. రామాయణం కేవలం మత గ్రంథం మాత్రమే కాదని కుటుంబ విలు వలు, నైతిక విలువలు బోధిస్తూ, సమాజ నిర్మాణానికి దిక్సూచిగా పనిచేస్తోందని అన్నారు. భార్యాభర్తలు, అన్న దమ్ముల మధ్య సఖ్యత గురించి, రాజ్య పరిపాలన ఎలా చేయాలో రామాయణం చదివితే చాలని విదేశీయులు సైతం భావిస్తుంటారన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తాం : వాల్మీకుల అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడితోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు. వాల్మీకులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధే టీడీపీ ధ్యేయ మన్నారు. ఎందరో వాల్మీకి సామాజిక వర్గ నేతలకు మంత్రిగా ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఇతర ప్రజా ప్రతినిధులుగా సీఎం చంద్రబాబు నాయుడు అవకాశమిచ్చారన్నారు. రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించేలా 2014-19లో సీఎం చంద్రబాబు శాశ్వత జీవో తీసుకొచ్చారన్నారు. సత్యపాల్ కమిటీ నివేదిక మేరకు 2014-19 మధ్య వాల్మీకులను ఎస్టీలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన ఘనత సీఎం చంద్ర బాబు దేనన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేలా కృషి చేస్తా మని మంత్రి సవిత స్పష్టం చేశారు. మరిన్ని బీసీ గురుకులాల ఏర్పాటు చేస్తామని.బీసీలను వ్యాపా రులుగా చేయడమే లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కార్పొరేషన్ చైర్మన్లు దేవేంద్రప్ప, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సీబీఐ విచారణ చేపట్టి, న్యాయం చేయాలి

●● మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సుగాలిప్రీతీబాయి కేసులో విషయంలో న్యాయం చేయాలని, సీబీఐ విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని, ఈనెల 16న మోడీ పర్యటలో మోడీ అపాయింట్ మెంట్ ఇప్పించాలని బాధితురాలు పార్వతి డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఎస్-9లో మహిళా సంఘాల నాయకులతో కలసి ఆమె పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీతీబాయి అత్యాచారం, హత్య గావిం చబడి 8 ఏళ్లయినా నేటికి కేసులో పురోగతి లేద న్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జనసేనా నేత ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీబీఐ విచారణ చేయా లని డిమాండ్ చేశారని తెలిపారు. అధికారం లోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికి సీబీఐ విచారణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కేసులో తమకు ప్రభుత్వం నుండి ఇచ్చిన పరి హారంపై జనసేనా పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం బాధాకరమన్నారు. అసెంబ్లీ సమావే శంలో ఏ ఒక్క రోజు సైతం ఈ విషయంపై చర్చించక పోవడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు న్యాయం చేస్తానని చెప్పిన పవన్‌కళ్యాన్ ఎందుకు న్యాయం చేయలేకపోతున్నాడో, మౌనంగా ఎందుకు ఉన్నారో చెప్పాలన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా స్పందించాలన్నారు. విజయవాడలో ఈ విషయంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 16న కర్నూలుకు ప్రదాని మోడీ వస్తున్నందున తమకు మోడీ అపాయింట్ మెంట్ ఇప్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను, జిల్లా కలెక్టర్, ఎస్పీకి విన్న వించుకుంటున్నట్లు తెలిపారు. లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష చేస్తానన్నారు. ఈ సమావేశంలో ప్రీతీబాయి తండ్రి రాజూనాయక్, జ్యోతి, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

విశాలాంధ్ర - ఆస్పరి: గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని ఎంపీపీ సుంకర ఉమాదేవి, ఎంపీడీవో గీతావాణి సూచిం చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాల యంలో మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల కోసం గ్రామీణ స్థానిక సంస్థలకు స్వంత ఆదాయ వనరులు పై శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం మనందరి బాధ్యతని శిక్షణా తరగ తుల ద్వారా పరిపాలన, ప్రణాళికలు, పంచాయతీ అభివృద్ధి పట్ల మంచి అవగాహన కలుగుతుంద న్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ, పారదర్శక పరిపాలన, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలను ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీవో గీతావాణి మాట్లాడుతూ ఈ శిక్షణ సర్పంచులు, కార్యదర్శులు తమ కర్తవ్యాలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేందుకు తోడ్పడు తుందన్నారు. గ్రామాల్లో ప్రాథమిక వసతులు, పారిశు ద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి రంగాల్లో పురోగతి సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో మండల ఇంజినీర్‌లు, పంచాయతీ సిబ్బంది, సర్పంచులు, కార్యదర్శులు, గ్రామ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర-పత్తికొండ: సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవా య్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు, ఐఏఎల్ జిల్లా అధ్యక్షులు ఎన్.కృష్ణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. సురేంద్ర కుమార్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.గురుదాస్‌లు వేరువేరుగా తీవ్రంగా వ్యతిరేకించారు. మంగళవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి జోష్ణ దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై కోర్టు వాదనలు జరుగుతున్న సమయంలో సనాతన ధర్మం పేరుతో ఓ న్యాయవాది షూ తో దాడి చేసేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి రెండు సెంట్లు స్థలమివ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రతి పేదవాడికి రెండు సెంట్ల ఇంటిస్థలం ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో 38, 39 సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. నగర పార్టీ కార్యవర్గ సభ్యులు ఎం.బీసన్న అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలో భాగంగా ప్రతి పేద వాడికి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చ లేదన్నారు. గత ప్రభుత్వం నగరంలోని జగన్నాథ గట్టు నందలి 8400 ఇందిరమ్మ గృహాలను గాలికి వదిలేయడం జరిగిందన్నారు. అదే జగన్నాథ్ గట్టు నందలి టిడ్కో గృహాలు దాదాపుగా 10,400 గృహాలు మధ్యలోనే ఆపివేయడం జరిగిందన్నారు. గత జగనన్న ప్రభుత్వం నగరానికి దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో స్థలాలు ఇవ్వడం జరిగిందని, వాటి గతి ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, స్థలమున్న ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి సి.కుమార్ స్వామి రెడ్డి నగర్, శాఖ కార్యదర్శి రామాంజనేయులు గౌడు, ఎన్.జి. నగర్ శాఖ కార్యదర్శి మహేష్, హైమావతి, స్వాములు, బాష, ఉమా, కృష్ణ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలంటూ మంగళ వారం స్థానిక తహసీల్దార్ కార్యా లయం ఎదుట ఏఐకెఎస్, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సహాయ కార్యదర్శి చంద్ర, కమిటీ సభ్యులు రాజు మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా రైతులు వేసిన పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. పత్తి, మిరప, ఉల్లి, ఆముదం పంటలు చేతికి రాక కుళ్ళిపోయాయన్నారు. నాయకులు నాగేష్, గోపాల్, గంగన్న, నర్సింహులు, నాగేంద్ర, రామాంజని, ఆంజనేయ పాల్గొన్నారు.

ప్రజారోగ్య అధికారిగా ఎస్బీ విష్ణుమూర్తి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక కార్యాలయంలో ప్రజారోగ్య అధికారిగా ఎస్బీ విష్ణుమూర్తి మంగళవారం బాధ్యతలను స్వీకరిం చారు. అంతకుముందు కమిషనర్ పి.విశ్వనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం పారిశుద్ధ్య తనిఖీదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు రూరల్: శ్రీనివాస్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుండి ప్రయాణికులతో వస్తూ ఎమ్మిగనూరు శివారు ప్రాంతం బాబా ఫక్రుద్దీన్ దర్గా సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. బస్సుతలో సుమారు 24 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణి కులంతా ఊపిరి పీల్చుకున్నారు. పెను ప్రమాదం తప్పిందని స్థాని కులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా శ్రీనివాస్ ట్రావెల్స్ యాజ మాన్యం నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగిందా, లేక డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగిందా అన్న వివరాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

విశాలాంధ్ర- పత్తికొండ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమది రైతుల ప్రభుత్వమని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. టమోటా, ఉల్లి, పంటలకు గిట్టుబాటు ధర లభించక పంటలను రోడ్డున పారబోస్తున్న ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో పత్తికొండలో రోడ్ల విస్తరణ చేపట్టేందుకు పూనుకుంటే, తెదేపా నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టులకు వెళ్లి పనులను నిలిపివేయడం జరిగిందని, ఇరుకు రోడ్లలో ట్రాఫిక్ సమస్య కారణంగా దసరా పండుగ రోజున పట్టణ నడిబొడ్డున ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలు కావడం జరిగిందన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.30 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, నాయకులు సోమశేఖర్, జిట్టా నాగేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ సీఈసీ మెంబర్‌గా కోట్ల హర్ష

విశాలాంధ్ర - కోడుమూరు: వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా కోట్ల హర్షవర్ధన్ రెడ్డి నియామకంపై వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మంగళ వారం పట్టణంలోని స్థానిక కోట్ల హర్ష కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇంచార్జి ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డిని పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో తీసుకున్న ఈ నిర్ణయం పార్టీని మరింత బలపరు స్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. కోట్ల హర్షవర్ధన్ రెడ్డి నియా మకంతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెరిగి పార్టీ కార్యకలాపాలు వేగవంతం అవుతాయని చెప్పారు. కోట్ల హర్ష వర్ధన్ రెడ్డి నేతృత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దంకా మోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రమేష్ నాయుడు, రవికుమార్ రెడ్డి, గుంతకంటి మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, బైన్‌దొడ్డి హనుమంతు, వార్డు సభ్యులు ఆకుల రవి, విష్ణుదాస్, హను మంతు, సురేష్, వీరేష్, లింగన్న, సుంకన్న, మధు, వీరన్న, ప్రసాద్ రెడ్డి, జగదీష్, రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకి, కనకదాసులు ఎంతో శ్రేష్టులు

విశాలాంధ్ర - హెూళగుంద: మహర్షి వాల్మీకి శ్రీ రామాయణ దర్శనం ధార్మిక గ్రంథాన్ని రచించి మానవ కులానికి సన్మార్గాన్ని ప్రసాదించాలని రాష్ట్ర వైసీపీ మహిళా కార్యదర్శి శశికళా కృష్ణమోహన్ అన్నారు. హెూలాగుండా లోవాల్మీకి విగ్రహానికి పూల హారాలు వేసి పూజలు జరిపారు. ఈ సందర్భంగా శశికళ కృష్ణమోహన్ మాట్లాడుతూ వాల్మీకి చూపిన మార్గంలో అందరూ నడవాలని విజ్ఞప్తి చేశారు. హెూలాగుండాలో నూతనంగా నిర్మిస్తున్న కనకదాసుడి ఆల యాన్ని పరిశీలించారు. కురువ కులస్తుల ఆరాధ్య దైవమైన కనకదాసుడి విశిష్టత చాలా గొప్పదని కొనియాడారు.వైసీపీ సీనియర్ నాయకుడు కురువ మొలగవల్లికృష్ణమోహన్, కురువ సంఘం నాయకులు శేషగిరి, నల్లారెడ్డి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

గిట్టుబాటు ధర లేక గొర్రెలకు వదిలేసిన రైతన్న

విశాలాంధ్ర - ఆలూరు : గిట్టుబాటు ధరల కోసం ఎదురు చూసిన ఓ రైతు చివరికి తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామానికి చెందిన చాకలి గోపాల్ కుమారుడు చాకలి పరమేష్, బోరు బావు కింద రెండు ఎకరాల ఉల్లి పంట సాగు చేశాడు. అయితే, ఇప్పటికే రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టానని, మార్కెట్‌లో ఉల్లి ధరలు తగ్గిపోవడంతో పాటు కూలీల రేట్లు పెరిగిపోవడంతో పంట కోత ఖర్చులు భరించలేక పోతున్నానని. ఈ పరిస్థితుల్లో, పెట్టుబడి వృథా చేసేందుకు ఎందుకని పరమేష్, తీవ్ర మనో వేదనతో పంటను గొర్రెలకు మేపుగా వదిలేస్తాడు. ఘటన స్థానికంగా కలకలం రేపింది. రైతు మాటల్లోనే ఇవాళ కోత కోసం కూలీలను పిలిస్తే, వారి ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చవుతుందని తెలిపాడు. కానీ మార్కెట్‌లో ఉల్లి క్వింటాలుకు రూ.500 దాటడం లేదని, ఈ పరిస్థితుల్లో పంట కోతకు వెళ్ళితే భారీగా నష్టం వస్తుందని ఆయన తెలిపాడు. ఇలాంటి పరిస్థితులు వాటిని ఎందుకు కోత కోసి మార్కెట్ తీసుకోవడం వృథా అవుతుందని ఆయన తెలిపారు. సాగు కోసం పెట్టుబడి పెరుగుతున్నా, ధరలు పడిపోతుండ టంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ రంగానికి తక్షణ మెరుగుదల అవసం మని రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసు కోవాలని ఆయన తెలియజేశారు. హెక్టార్‌కి రూ.50 వేలు ప్రభుత్వం ఇస్తుందని, తెలిపినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయ ఇచ్చింది లేదని

ఆయన తెలియజేశారు. కానీ హెక్టర్ కాదు ఎకరాకు రూ.50 వేల ఇచ్చినా పెట్టుబడి సరిపోదని తెలిపాడు. రైతులకు మద్దతు ధరల అమలు కచ్చితంగా ఉండాలన్నది గ్రామస్తుల డిమాండ్. స్థానిక వ్యవసాయ అధికారులు, రైతు సంఘాలు ఈ ఘటనపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని. లేదంటే ఇలాంటి సంఘటనలు మరిన్ని గ్రామంలో చోటుచేసుకునే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కుట్టిం ప్రభుత్వం స్పందించి వెంటనే రైతును ఆదుకోవాలని ఆయన తెలిపాడు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 08, అక్టోబరు 2025

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు
శకునాల పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర - ఓర్వకల్లు: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభాపాటవాలన ప్రదర్శించి, జిల్లా జట్లకు ఎంపికైనట్లు మండల పరిధిలోని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సునీత తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మూడు శాతం స్పోర్ట్స్ కోటా కింద భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవచ్చని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలలోనూ విద్యార్థులు క్రీడల్లో రాణించి పథకాలు సాధిస్తే పాఠశాల తరపున వారికి ప్రోత్సా హకాలను ప్రకటిస్తామన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు మహమ్మద్ బాష నరసింహులు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని అవుట్డోర్ స్టేడియంలో సోమవారం జరిగిన రగ్బీ అండర్ 14 బాలుర విభాగంలో మణిజయవర్ధన్, బాలికల విభాగంలో వెంకట హేమ, ఎంపిక కాగా అండర్ 17 విభాగంలో ప్రసన్న రాణి ఎంపికయ్యారు. అండర్ 17 బాలికల విభాగంలో స్టాండ్ పైగా మాధవి ఎంపికయ్యారు. సెప్టెంబర్ 15వ తారీఖున నిర్వహించిన నెట్ బాల్ అండర్ 14 బాలికల విభాగంలో ఉమా మహేశ్వరి ఎంపికయ్యారన్నారు. రైఫిల్ షూటింగ్ అండర్ 14 బాలుర విభాగంలో బి.మణి జయవర్ధన్, బి.లిథిన్, బాలికల విభాగంలో లిస్మిత ఎంపికయ్యారని తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో బి.చిన్న రాముడు స్టాండ్ బైగా,బాలికల విభాగంలో సైదాబీ, ప్రశాంతి ఎంపిక కాగా అండర్ 19 బాలికల విభాగంలో ఇంద్రావతి, మనీషా, శ్వేత, భూమిక, రేణుక, బాలుర విభాగంలో బి మణిదీప్ ఎంపికయ్యారని తెలిపారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిలతో పాటు వారికి క్రీడల్లో శిక్షణ ఇచ్చిన వ్యామ ఉపాధ్యాయులు మహమ్మద్ బాష, నరసింహులును పాఠశాల ప్రధానోపా ధ్యాయిని సునీత, ఉపాధ్యాయ ఉపాధ్యాయ తర సిబ్బంది అభినందించారు.

ఘనంగా జరిగిన వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - హొళగుంద: మహర్షి వాల్మీకి జయంతిని వాల్మీకి కుల పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో హొళగుందలో మంగళవారం ఘనంగా జరిగింది. వాల్మీకి చిత్రపటాన్ని డీజే ద్వారా భారీ ఊరేగింపు నిర్వహించి పురవీధుల్లో తిరిగారు. ఈ సందర్భంగా వాల్మీకి కుల పెద్దలు మాట్లాడుతూ బోయ వాల్మీకులు ఎన్నో సంవత్సరాలుగా కులవృత్తిని ఆధారంగా జీవిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బోయ వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. వాల్మీకి సేవా సమితికి 60 సెంట్లు దానం చేసిన హెచ్ జే పవన్ కుమార్ను, శ్రీ వాల్మీకి సేవా సమితి ట్రస్ట్ రిజిస్ట్రేషన్ కోసం టీడీపీ యువ నాయకుడు తోక వెంకటేష్ రూ.20 వేల ప్రకటించినందుకు, జయంతి వేడుకలు నిర్వహించడానికి టీడీపీ సీనియర్ నాయకుడు ఇ.గోవింద గౌడ్ రూ.10 వేల విరాళం ఇచ్చినందుకు వాల్మీకి కుల సంఘం పెద్దలు, యువకులు శాలువా కప్పి పూలహారాలు వేసి ఘనంగా సన్మానించారు. వాల్మీకి మహర్షికి పూల హారాలు వేసి వాల్మీకి సోదరులు ప్రత్యేక పూజలు చేసి, ఆకు పూజలను చేపట్టారు. వాల్మీకి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే విరుపాక్షి తనయుడు బి.చంద్రశేఖర్, రాష్ట్ర వైసీపీ మహిళాకార్యదర్శి శశికళ కృష్ణమోహన్, రాష్ట్ర బోయ వాల్మీకి పోరాట సమితి అధ్యక్షులు రామ్ భీం నాయుడు, వాల్మీకి కుల పెద్దలు, వాల్మీకి యువకులు, వాల్మీకి అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీ, గ్రామ సచివాలయాలలో వాల్మీకి జయంతిని ఉద్యోగులు ఘనంగా జరిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వాల్మీకి జయంతిని వాల్మీకి సోదరులు ఘనంగా జరిపారు. వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి దేవాలయాలు కిటకిటలాడాయి. వాల్మీకి మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి భజన కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర - డోన్ రూరల్: రామాయణాన్ని రచించిన ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఎంఎస్ఆర్ ఆఫీస్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మానవ జాతికి మార్గ దర్శకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, ప్యాపిలి మండలం టీడీపీ అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, సర్పంచ్ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి ఆధ్వర్యంలోచ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూల మాల వేసి ఘనమైన నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి హిందూ ఇతిహాస మైన రామాయణంను రచించి ఆదికవిగా పేరొందిన గొప్ప వ్యక్తి అని, ప్రతి ఒక్కరి జీవితంలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్పే మహా కావ్యం రామాయణం అని ప్రిన్సి పాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామ కృష్ణ, మల్లికార్జున, విజయశేఖర్, సోమేష్, పార్థసారథి పటేల్, జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, ఉల్లోజి రావు, గిరిజారాణి పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - పత్తికొండ: పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పోషణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, జామ, మునగ ఆకు తోపాటు పౌష్టిక విలువలతో కూడిన కాయగూరలను తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిన్నారుల వ్యాధి నిరోధక శక్తికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించి, కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ, అంగన్వాడీలు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

విశాలాంధ్ర - ఆలూరు: సుప్రీంకోర్టు భారత ప్రధాన న్యాయమూర్తి డిఆర్ గవాయ్పై జరిగిన దాడ హేయమయిందని పలువురు న్యాయవాదులు ఖండించారు. మంగళవారం దాడలు ఖండి ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ముందు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐలు నియోజకవర్గం అధ్యక్షులు వీరేష్, కార్యదర్శి షాకీర్ మాట్లాడారు. భారత అత్యున్నతమైన న్యాయస్థానంలో ఉండే ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సాధారణ ప్రజలకు ఏమి రక్షణ ఉంటుందని, ఈ దాడితో యావత్తు భారతదేశం అంతా ఆందోళనకు గురైందన్నారు. ఇలాంటి చర్యలు జరగకుండా చూసుకోవాలని, అటువంటి వ్యక్తి పైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐలు న్యాయవాదులు ప్రసాద్, విజయ్ భాస్కర్, చంద్ బాష, ఈరన్న రావు, నరేష్, క్లర్క్ శీనప్ప, పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - సి.బెలగల్: సంపూర్ణ రామాయణాన్ని అద్భుతంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించి నివాళులర్పించారు. బురాన్ దొడ్డి గ్రామంలో కీర్తిశేషులు మాజీ ఎంపీపీ శ్రీరాములు కుటుంబ సభ్యులు వాల్మీకి మహర్షి దేవాలయంలో కుటుంబ సభ్యులందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కోడుమూరు: రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక పెద్ద బోయగేరి వీధిలోని వాల్మీకి విగ్రహం వద్ద పట్టణానికి చెందిన చిన్న బోయగేరి, పెద్ద బోయగేరి వాల్మీకులు వాల్మీకి జయంతి వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వాల్మీకి యువకులు పట్టణంలోని పురవీధుల్లో పెద్దఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. వాల్మీకి జయంతి సందర్భంగా వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యులు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్, జడ్పీటీసీ రఘునాథరెడ్డి తదితరులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ రమేష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాముడు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండల వ్యాప్తంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో వేడుకలు జరిపారు. మండలంలోని కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం, నాయన పల్లి, గోరుమానుపల్లి, కనకాద్రి పల్లి తదితర గ్రామాలలో మహర్షి వాల్మీకి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జయంతి వేడుకలను జరుపుకున్నారు. మహాకావ్యం రామాయణాన్ని భరతజాతికి అందించిన వాల్మీకి మహర్షి మహనీయులుగా పూజలు అందుకుంటున్నారన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని రంగాలలో వెనుకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుతమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: పట్టణంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కోవెలకుంట్ల మహర్షి వాల్మీకి సంఘం అధ్యక్షులు రంగడు ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ రామాయణాన్ని మహా అద్భుత కావ్యంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం ప్రెసిడెంట్ రంగడుతో పాటు, యువజన నాయకుడు నాగ మల్లేష్, కార్యదర్శి సుబ్బయ్య, ట్రెజరర్ టైలర్ మధు, వెంకటేశ్వర్లు, బాలయ్య, రాజు, వెంకట రాముడు పాల్గొన్నారు.

వసతి గృహ హాస్టల్ వార్డెన్కు జిల్లా ఉత్తమ స్వచ్ఛత అవార్డు

విశాలాంధ్ర జూపాడు బంగ్లా: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ వార్డెన్ ఉమాదేవి విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ స్వచ్ఛత అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ చేతుల మీదుగా ఉమాదేవి జిల్లాస్థాయి ఉత్తమ అవార్డుని అందుకున్నారు. హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ, ఆహార నాణ్యత, పర్యావరణహిత కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ఉమాదేవి చూపిన శ్రద్ధ ప్రశంసనీయమన్నారు. ఉమాదేవి హాస్టల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రతిరోజూ క్రమబద్ధంగా శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో స్వచ్ఛత, క్రమశిక్షణ అలవర్చడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ ఉమాదేవి మాట్లాడుతూ ఈ అవార్డు తన వ్యక్తిగత గౌరవమే కాదు, మా హాస్టల్ సిబ్బంది, విద్యార్థుల కృషికి ప్రతిఫలంగా భావిస్తున్నాను అని ఆమె తెలిపారు. భవిష్యత్తులో పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ చింతామణి, ఎస్‌డబ్ల్యూఓ అంకన్న పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని మదిరి గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మదిరి గ్రామంలో నెలకొల్పిన వాల్మీకి మహర్షి విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి సూరం భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణ మహా గ్రంధాన్ని మానవాళికి అంకితం చేశారని గుర్తు చేశారు. వాల్మీకి రచించిన రామాయణంలో భవిష్యత్ తరానికి సంబంధించిన ఎన్నో విలువలతో కూడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడుస్తూ పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సాదీ రావుఫ్, రామచంద్ర,మల్లికార్జున, శ్రీనివాసులు, ఎన్సీకె నాగరాజ్, మల్లేశ్వరప్ప, బీటీ సీన, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు చర్యలు

- నగర ప్రగతే మా పథం
- రూ.4.33 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన
- దశాబ్దాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగర ప్రగతే తమ పథమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం నగరంలోని వివిధ వార్డుల్లో రూ.4.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి. విశ్వనాథ్తో కలిసి శంకుస్థాపనలు చేశారు. 48వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ కాలనీలో సీసీ రోడ్లు, 13వ వార్డులో బసవా సర్కిల్ వద్ద సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులు, 8వ వార్డులో పెద్దపడకాన మైదానం వద్ద మహిళల కమ్యూనిటీ టాయిలెట్, మోతియా హైస్కూల్ వెనుకభాగంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 17వ వార్డు జోహరాపురంలో సీసీ రోడ్ల నిర్మాణం, 18వ వార్డులో పబ్లిక్ టాయిలెట్ పునర్నిర్మాణం, 24, 25వ వార్డులకు సంబంధించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సర్కిల్ పునరుద్ధరణతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో డివైడర్లకు పెయింటింగ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ నగరంలోని ప్రతి వార్డులో అవసరమైన మౌలిక వసతులు కల్పించేం దుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, దశాబ్దాలుగా ఉన్న ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ పి. విశ్వనాథ్ నిజాయితీగా, కఠినంగా పని చేస్తున్నారని, దీన్ని ఓర్వలేక కొందరు పనిగట్టుకుని పత్రికల్లో వార్తలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పనులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని, బాగా పనిచేస్తే ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. నగరాన్ని స్మార్ట్ సిటిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎగ్జామినేషన్ గ్రౌండ్ను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. పట్టాల పంపిణీలో అనేక నిబంధనలు సడలించి, వేలాది కుటుంబాలకు ప్రయోజనం కలిగించామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన పనులకు కూడా బిల్లులు కూడా చెల్లించామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరిల సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపి హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి, కార్పొరేటర్లు కైప పద్మలత రెడ్డి, కురబ పరమేష్, జె.రమణమ్మ, డిఈఈ గంగాధర్, క్రిష్ణలత, ఏఈ రాంమోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ జస్టిస్ గావాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - ఆస్పరి: భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ జస్టిస్ గావాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రములోని స్థానిక మార్కెట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ న్యాయ వ్యవస్థకు ప్రతీక అయిన సీజెఐపై మతోన్మాది దాడి జరగడం చాలా బాధాకరమని తెలిపారు. సంగ్ పరివార్ వ్యాప్తి చేస్తున్న మతోన్మాదానికి ఈ దాడి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాదం రోజురోజుకు పెరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వాదులను అణగదొక్కే ప్రయత్నంలో భాగంగా ఈ దాడి జరిగిందన్నారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ దీనిపై తన అభిప్రాయాన్ని వెల్లడించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తెవుల తిప్పన్న, పరుశురాముడు, మాల మహానాడు నాయకులు వీరేష్, వెంకట రాముడు, చాగి సాయి, దాసరి అజయ్, రంగ నాయకులు, అలారుదిన్నె మహానంది పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన శ్రీశైలం దేవస్థాన బోర్డు సభ్యురాలు డా.సింధుశ్రీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలోని ప్రముఖ జగన్ హాస్పిటల్స్ అధినేత డా. జగన్ మోహన్ రెడ్డి సతీమణి డా. సింధుశ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యురాలిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల నియోజకవర్గం నుండి అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వం, మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు డా.సింధుశ్రీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పవిత్ర శ్రీశైలం దేవస్థానం ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా అపారమైన ప్రాధాన్యత కలిగిన పవిత్ర స్థలమని, అటువంటి గొప్ప ప్రాశస్త్యం కల్గిన దేవస్థాన సమగ్ర అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలు, భక్తులకు అందించే సేవల మెరుగుదల దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. శ్రీశైలం దేవస్థాన బోర్డులో సభ్యురాలిగా చోటు సంపాదించుకున్న డా.సింధుశ్రీ సేవలు ప్రజాహితానికి, మహిళా సాధికారతకు తోడ్పడటమే కాకుండా, శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి దోహదం చేయ్యాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. అనిల్ కుమార్, డా. జగన్ మోహన్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే భారీ చోరీ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని మదనంతపురం గ్రామం కలాల కాలనీలోని అంబటి జనార్ధన్ రెడ్డి ఇంటి తలాలు పగలగొట్టి పట్టపగలే దొంగలు మంగళవారం చోరీకి పాల్పడ్డారు. బీరువాను తాలాలతో తెరిచి అందులోని సుమారు పది తులాల బంగారు నగలు, రూ పదివేల నగదును పట్టుకెళ్ళారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో పట్టపగలు దొంగలు చోరీకి తెగబడిన ఘటన చుట్టుపక్కల గ్రామాలలో సంచలనం రేపుతున్నది. గ్రామం బయట ప్రధాన రహదారి సమీపంలోని కలాల కాలనీలో నూతనంగా నిర్మించుకున్న ఇంటిలో అంబటి జనార్దన్ రెడ్డి నివాసం ఉంటున్నాడు. ఉదయం పిల్లలు స్కూల్‌కి వెళ్లడంతో జనార్ధన్ రెడ్డి, అతని భార్య అమల ఇంటికి తాళాలు వేసి గ్రామ సమీపంలోని టమేటా సాగుచేసిన తోటకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి రాగా అప్పటికి ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడిన భార్య భర్త ఇరువురు ఇంటిలోకి వెళ్లి బీరువాను చూశారు. బీరువాపైనే ఉంచిన తాళాలతో దొంగలు బీరువాను తెరిచి అందులోని మూడు తులాల నల్లపూసల బంగారు గొలుసు, ఒక తులం మెడ గొలుసు, ఆరు జతల కమ్మలు, జత చెంప చారలు, ఆరు బంగారు ఉంగరాలతో పాటు, పది తులాల వెండి గొలుసులు, పదివేల నగదును దొంగలు చోరీ చేసినట్లు గుర్తించి ఆవేదన చెందుతున్నారు.చోరీ ఘటనను స్థానిక పోలీసుల దృష్టికి బాధితులు తీసుకువెళ్లారు. ఇంటికి సమీపంలోని పొలంలో ఇద్దరు దుండగులు, రహదారి సమీపంలో మోటార్ సైకిల్ పై మరో ఇద్దరు దుండగులు మాస్కులు కట్టుకొని వచ్చారారని అక్కడ సమీపంలోని మరో కాలనీ వ్యక్తి గమనించి అతని ఇంటి మీద నుండి పొలంలో ఏం చేస్తున్నారని ప్రశ్నించగా వాళ్ళు పారిపోయినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర -చిప్పగిరి: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామం తో పాటు మండల పరిధిలోని నగర డోన, నేమకల్లు, దేగల హాల్ గ్రామాలతోపాటు ఆయా గ్రామాలలో వాల్మీకి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గ్రామ గ్రామాన వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించకున్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి సేవలను కొనియాడారు.

మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: మెడికల్ కళాశాలలోపై వైసీపీ డైవర్స్ రాజకీయాలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని నంద్యాల పార్లమెంట్ సభ్యులు రాలు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం పట్టణంలోని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి స్వగృహం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం ఈనెల 16వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ మన రాష్ట్రానికి వస్తుంటే ఇదే అదునుగా చూసుకొని వైసిపి నాయకులు అదే రోజు రచ్చబండ, కోటి సంతకాల సేకరణ అంటూ డైవర్స్ రాజకీయాలు చేస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు పోవడం జరుగుతుందని, అదేవిధంగా చంద్రబాబు ఆధ్వర్యంలో పి పి పి పద్ధతిలోనే మెడికల్ కళాశాల నిర్మాణం, ఆధునిక వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు పల్లె రఘురామిరెడ్డి, మాజీ జెడ్పిటిసి నాగేశ్వరావు, గుణశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, మురళీధర్ రెడ్డి, కౌన్సిలర్ చాంద్ భాషా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.